క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 26న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. పీజీఆర్ అపార్ట్‌మెంట్స్, సిద్ధార్థనగర్ ప్రాంతాల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, లష్కర్ బజార్, లష్కర్ బజార్ మెయిన్ రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు, న్యూశాయంపేట సబ్‌స్టేషన్ ప్రాంతంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మడికొండ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే, వరంగల్‌లోని వేణురావు కాలనీ ప్రాంతంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ పేర్కొన్నారు.

మొబైల్ ఫోన్ల అప్పగింత



వరంగల్ చౌరస్తా: వరంగల్ ఇంతేజార్‌గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న ఏడుగురు వ్యక్తుల మొబైల్ ఫోన్లను గుర్తించి తిరిగి బాధితులకు అప్పటించినట్లు ఇన్‌స్పెక్టర్ ఏంఏ షుకూర్ తెలిపారు. ఈ సందర్భంగా రైటర్ సందీప్, క్రైమ్ ఇన్‌స్పెక్టర్ దీపక్‌ను ఇన్‌స్పెక్టర్ అభినందించారు.

వ్యక్తి అదృశ్యం



కాజీపేట రూరల్: ఒడిశాకు చెందిన ఒక వ్యక్తి తప్పిపోయినట్లు కాజీపేట జీఆర్పీ పోలీసులు తెలిపారు. కాజీపేట జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ వి.నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఒరిస్సాకు చెందిన 43 ఏళ్ల బృష భానుబాగ్.. పర్వతగిరి గ్రామంలో అరటి తోటలో పనిచేస్తున్నాడు. తన సొంతూరు ఒడిశాకు వెళ్లేందుకు జులై 1వ తేదీన కాజీపేట రైల్వే స్టేషన్‌కు వెళ్లి నాగవల్లి ఎక్స్‌ప్రెస్ ఎక్కాడు. ఇప్పటివరకు ఒరిస్సాలోని ఇంటికి చేరకపోవడంతో అతడి భార్య రశ్మిత బాగ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఆచూకీ తెలిస్తే 87126 58609 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

'భద్రకాళి'లో సింధు మాతాజీ



హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయాన్ని హైదరాబాద్ గచ్చిబౌలిలోని భద్రకాళి పీఠానికి చెందిన దేవి ఉపాసకురాలు సింధు మాతాజీ సోమవారం సందర్శించి పూజలు చేశారు. ఈ సందర్భంగా మాతాజీని అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతించారు. పూజల అనంతరం ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

వరంగల్ స్పోర్ట్స్ / కాజీపేట అర్బన్: ఈ నెల 24వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించిన అంతర్జాతీయ మార్షల్ ఆర్ట్స్, కరాటే, కుంగ్‌ఫూ, తైక్వాండో చాంపియన్ పోటీల్లో హనుమకొండలోని యజూర్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారని స్కూల్ ఎండీ డాక్టర్ జలీల్ అహ్మద్ తెలిపారు. ఈ మేరకు కోచ్ క్రాంతికుమార్, పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందించారు.

లైబ్రేరియన్ అవార్డు ప్రదానం

హసన్‌పర్తి: జాతీయ స్థాయి ఉత్తమ గ్రంథాలయాధికారి అవార్డును నగరంలోని కిట్స్ కళాశాల లైబ్రేరియన్ డాక్టర్ ఇంద్రసేనారెడ్డి అందుకున్నారు. చెన్నైలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో మద్రాస్ లైబ్రేరియన్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కె.నిత్యానందం నుంచి అవార్డు స్వీకరించారు. ఆధునిక గ్రంథాలయ అభివృద్ధి, డిజిటల్ లైబ్రరీల స్థాపన, నూతన సాంకేతిక పద్ధతుల ద్వారా విజ్ఞాన సముపార్జనలో సేవలను గుర్తించి ఆయనకు ఈ అవార్డు ప్రదానం చేశారు.

ఎస్సీ ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడిగా లక్ష్మణ్

న్యూశాయంపేట: తెలంగాణ ఎస్సీ కార్పొరేషన్ ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడిగా హనుమకొండ జిల్లా నడికూడకు చెందిన తిప్పారపు లక్ష్మణ్ మాదిగ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మాధవీలతను ఎన్నుకున్నారు. హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన రాష్ట్ర ఉద్యోగుల సంఘం సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. 33 జిల్లాలకు చెందిన కార్పొరేషన్ ఉద్యోగులు లక్ష్మణ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

'సమాచార హక్కు చైతన్య సమితి' కన్వీనర్‌గా లత

రామన్నపేట: సమాచార హక్కు చైతన్య సమితి రాష్ట్ర మహిళా కన్వీనర్‌గా చిమ్మని లత ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు సాదుల పూర్ణచందర్ తెలిపారు. ఎస్ఆర్ఆర్ తోట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో సమితి సభ్యుల సమక్షంలో లతకు సోమవారం నియామక పత్రం అందజేశారు.

వామ్మో కుక్కలు!

- వరుస దాడులతో జనం బెంబేలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

కాజీపేట : కాజీపేట పట్టణంలోని పలు కాలనీల్లో వీధి కుక్కల సంచారం విపరీతంగా పెరిగింది. మునుపెన్నడూ లేని రీతిలో పలు కాలనీల్లో కుక్కలు తిరుగుతుండడంతో స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. నిత్యం ఏదో ఒక ప్రాంతంలో పాదచారుల, వాహనదారులపై దాడులు చేస్తున్నాయి. సిద్ధార్థనగర్ కాలనీలోనే వారంలో ముగ్గురు కుక్క కాటుకు గురికావడం చర్చనీయాంశంగా మారింది. బాపూజీనగర్, డీజిల్‌కాలనీ, ప్రశాంత్‌నగర్, రైల్వే క్వార్టర్స్, సోమిడి, వెంకటాద్రినగర్, జమామసీదు గల్లీల్లో వీధి కుక్కల బెడద ప్రమాదకరంగా తయారైందని స్థానికులు వాపోతున్నారు. రాత్రివేళల్లో రహదారుల వెంట వచ్చిపోయే ప్రయాణికులు, ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. శునకాల నివారణకు చర్యలు చేపట్టాలని పలు కాలనీల వాసులు ఫిర్యాదు చేసినా మున్సిపల్ అధికారులు స్పందించడం లేదు. ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి వీధికుక్కల నుంచి రక్షణ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రశాంత్‌నగర్ కాలనీలో సంచరిస్తున్న కుక్కలు

పది మందికిపైగా గాయాలు



కుక్క దాడిలో గాయపడిన చిన్నారి (ఫైల్)

కాజీపేటలో గత బుధవారం ఓ పిచ్చికుక్క స్వైర విహారం చేసి పలువురిని తీవ్రంగా గాయపర్చింది. బాపూజీనగర్, జూబ్లీమార్కెట్, విద్యానగర్ కాలనీ ప్రాంతాల్లో కనిపించిన వారిపై దాడిచేసి గాయపర్చింది. ఇంట్లో ఆడుకుంటున్న రెండున్నరేళ్ల బాలికను కరిచింది. దాంతో ఆ కుక్కను యువకులు చంపేశారు.

పిల్లలపై దాడి చేస్తున్నాయి



పట్టణంలో విచ్చలవిడిగా కుక్కలు తిరుగుతూ ఎక్కువగా పిల్లలపైనే దాడికి పాల్పడుతున్నాయి. ఒంటరిగా బడికి పంపించాలంటే భయంతో వణికిపోతున్నాం. ఇప్పటికే పలువురిపై దాడి చేశాయి. బాధితులు సోమిడి అర్బన్ హెల్త్ సెంటర్‌కు వెళ్లి చికిత్స పొందుతున్నారు. కుక్కల బెడద నుంచి ప్రజలకు రక్షణ కల్పించాలి.

\- గౌని వినోద, విష్ణుపురి

కుక్కల బెడదను అరికట్టాలి



ఏ కాలనీలో చూసినా గుంపులుగా కుక్కలు తిరుగుతు కనిపిస్తాయి. ఎన్నడూ లేనిది ఇప్పుడు చిన్నపిల్లలు, మహిళలపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. బయటకు వెళ్లాలంటేనే భయంగా ఉంది. మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి ప్రమాదకరంగా తయారైన కుక్కలను పట్టుకెళ్లి దూరంగా వదిలిపెట్టాలి.

\- గుర్రం కోటేశ్వర్, వ్యాపారి, సోమిడి

ఘనంగా బీపీ మండల్ జయంతి

బిందేశ్వర్ ప్రసాద్ (బీపీ) మండల్ జయంతిని నగర వ్యాప్తంగా సోమవారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీలు, కులమతాలు, ప్రాంతాలకు అతీతంగా ఐక్య ఉద్యమాలు చేసినప్పుడే బీసీలకు సామాజిక న్యాయం జరుగుతుందని పలువురు వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు.

\- సాక్షి నెట్‌వర్క్



ఆర్ట్స్ కళాశాలలో బీపీ మండల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, తదితరులు



హనుమకొండలోని మాస్టర్‌జీ డిగ్రీ కళాశాలలో..



హనుమకొండ హరిత కాకతీయ హోటల్‌లో..



హనుమకొండ నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ విద్యుత్ అతిథి గృహం ఆవరణలో..



హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో..

ఎయిడ్స్ నాలుగు విధాలుగా వ్యాప్తి



సదస్సులో మాట్లాడుతున్న గోవర్ధన్

వరంగల్ చౌరస్తా: హెచ్ఐవీ, ఎయిడ్స్ మహమ్మారి నాలుగు విధాలుగా వ్యాప్తి చెందుతుందని ఉమెన్స్ ఆర్గనైజేషన్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ (వర్డ్) ప్రాజెక్టు మేనేజర్ గోవర్ధన్ తెలిపారు. వరంగల్ ప్రభుత్వ కృష్ణా మహిళా జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ హరికృష్ణ అధ్యక్షతన విద్యార్థినులకు హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్త పరీక్ష ద్వారా హెచ్ఐవీని గుర్తించవచ్చని అన్నారు. సెక్సువల్, రక్త మార్పిడి, సిరంజీ ద్వారా, తల్లి గర్భం నుంచి బయటకు వచ్చిన శిశువుకు ఎయిడ్స్ వ్యాప్తి చెందుతుందని పేర్కొన్నారు. ఎయిడ్స్‌కు మందు లేదని, నివారణే మార్గమని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల స్టాఫ్ సెక్రటరీ మాడుగుల శ్రీనివాస శర్మ, జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారులు వనమాల, ప్రవళిక, అధ్యాపకులు, వర్డ్ ఆర్గనైజర్లు దేవరాజు, రాజేందర్ పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకోవాలి

- కేడీసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీనివాస్

విద్యారణ్యపురి: పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను విద్యార్థులు పెంపొందించుకోవాలని హనుమకొండ కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (కేడీసీ) ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ గుర్రం శ్రీనివాస్ సూచించారు. కేడీసీలో డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు ఉచిత శిక్షణ అండ్ ప్లేస్‌మెంట్‌పై ఓరియంటేషన్ కార్యక్రమాన్ని మేజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ సహకారంతో సోమవారం నిర్వహించారు ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు రాకేష్, విక్రమ్‌సింగ్ మాట్లాడుతూ ఉద్యోగ సాధనలో సాఫ్ట్ స్కిల్స్ కీలకమని చెప్పారు. బాడీ లాంగ్వేజ్, కాన్ఫిడెన్స్, లీడర్‌షిప్ క్వాలిటీస్, ప్రొఫెషనలిజంతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయని అన్నారు. కార్యక్రమంలో కేడీసీ ప్లేస్‌మెంట్ సెల్ ఆఫీసర్ డాక్టర్ అనిల్, వైస్ ప్రిన్సిపాల్ రజనీలత, టాస్క్ కోఆర్డినేటర్ డాక్టర్ రాజశేఖర్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనాథ్, అధ్యాపకులు శివనాగ శ్రీను, చిన్న, కుమార్, శ్రావణకుమారి, శ్రీకాంత్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

వేడుకల్లో నిబంధనలు పాటించాలి

న్యూశాయంపేట: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో వరంగల్ పోలీసు కమిషనర్ జారీ చేసిన నిబంధనలను నిర్వాహకులు తప్పకుండా పాటించి పోలీసు యంత్రాంగానికి సహకరించాలని మామునూరు ఏసీపీ వెంకటేష్ సూచించారు. ఏనుమాముల పోలీసుస్టేషన్ ఆవరణలో గణపతి ఉత్సవాల నిర్వాహక మండళ్ల ప్రతినిధులతో సోమవారం సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండపం ఏర్పాటు కోసం ఆన్‌లైన్‌లో అన్ని వివరాలను తప్పనిసరిగా సమర్పించాలన్నారు. మండపాల కోసం రోడ్లు మొత్తాన్ని ఆక్రమించవద్దని, డీజేలకు అనుమతి లేదని, రాత్రి 10గంటల తర్వాత మైక్‌లను వాడొద్దని హెచ్చరించారు. ఏనుమాముల ఇన్‌స్పెక్టర్ సురేష్, ఎస్సై రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

కాజీపేట: గణపతి నవరాత్రోత్సవాలను భక్తులు ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని ఇన్‌స్పెక్టర్ సుధాకర్ రెడ్డి తెలిపారు. పట్టణంలోని వినాయక మండలి సభ్యులతో కాజీపేట పోలీస్ స్టేషన్ ఆవరణలో సోమవారం రాత్రి అవగాహన సదస్సు ఏర్పాటు చేసి దిశానిర్దేశం చేశారు. సమావేశంలో ఎస్సైలు నవీన్‌కుమార్, లవన్‌కుమార్, శివతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

విలీన గ్రామాలకు నిధులు ఇవ్వాలి



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

కాజీపేట: నూతన మండలంగా ఆవిర్భావించిన కాజీపేట పట్టణంతో పాటు విలీన గ్రామాల్లో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గాదె ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. కాజీపేట మున్సిపల్ సర్కిల్ కార్యాలయం ఎదుట కార్యకర్తలతో కలిసి సోమవారం ఆందోళన నిర్వహించారు. పార్టీ మండల కార్యదర్శి ఓరుగంటి సాంబయ్య ఆధ్వర్యంలో కాజీపేట చౌరస్తా నుంచి మున్సిపల్ సర్కిల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ జి.రవీందర్‌కు నాయకులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఎం.చుక్కయ్య, తొట్టె మల్లేశం, సంటి రవి, జంపాల రమేష్, ఎండీ.అజహర్ అలీ, రామంచ సారంగపాణి, వనమాల పాల్గొన్నారు.

మత విద్వేషాలపై గళం విప్పాలి

వరంగల్ చౌరస్తా: పెట్రేగిపోతున్న ప్రపంచీకరణ, మత విద్వేషాలపై కళాకారులు గళం విప్పి ప్రజలను చైతన్యవంతం చేయాలని ఐక్య ప్రజానాట్య మండలి (యూపీఎస్‌ఎం) రాష్ట్ర కార్యదర్శి కన్నం వెంకన్న కోరారు. వరంగల్ అండర్ బ్రిడ్జి వద్ద ఎంసీపీఐ (యూ) కార్యాలయం ఓంకార్ భవన్‌లో ప్రజానాట్య మండలి జిల్లా విస్తృతస్థాయి సమావేశాన్ని దాసారపు అనిల్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. సమావేశంలో ఐక్య ప్రజానాట్య మండలి వరంగల్ జిల్లా కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి, కవి, గాయకుడు, దర్శకుడు రాజేష్ కన్నా, గూడ సురేష్, గుర్రం రవి, కుమారస్వామి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకన్న

వేయిస్తంభాల గుడిలో నవరాత్రోత్సవాలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సునీత, సిబ్బంది

హన్మకొండ కల్చరల్ : నగరంలోని వేయిస్తంభాల దేవాలయంలో శ్రీమహాగణపతి నవరాత్రి మహోత్సవాల సందర్భంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వరంగల్ జిల్లా దేవాదాయధర్మాదాయశాఖ అసిస్టెంట్ కమీషనర్ రామల సునీత తెలిపారు. సోమవారం దేవాలయంలో జరిగిన సమావేశంలో ఉత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ దేవాలయంలో రేపటి (బుధవారం) నుంచి సెప్టెంబర్ 5వతేదీ వరకు శ్రీమహాగణపతి నవరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఈఓ అనిల్‌కుమార్, ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ, గట్టు మహేష్‌బాబు, అమ్మవారి ఉపాసకులు సింధుమాతాజీ, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యుడు ఈవీ శ్రీనివాస రావు, తదితరులు పాల్గొన్నారు.

లైంగిక దాడులను అరికట్టాలి



మాట్లాడుతున్న అడిషనల్ డీసీపీ రవి

హన్మకొండ: బాలలపై లైంగిక దాడులను సమర్థవంతంగా నిర్మూలించాలని అడిషనల్ డీసీపీ ఎన్.రవి అన్నారు. హనుమకొండ సుబేదారిలోని అసుంత భవన్‌లో చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ బెంగళూరు, ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ సంయుక్తంగా రాష్ట్రంలోని ఎంపిక చేసిన స్వచ్ఛంద సంస్థలకు ఆన్‌లైన్‌లో 'బాలల లైంగిక దోపిడీని నిర్మూలించడంలో స్వచ్ఛంద సంస్థల పాత్ర' అనే అంశంపై రెండు రోజుల పాటు జరిగే రాష్ట్ర స్థాయి వర్క్‌షాపు సోమవారం ప్రారంభమైంది. సైబర్ క్రైమ్ ఏసీపీ గిరికుమార్ మాట్లాడుతూ సైబర్ నేరాలపై పిల్లలు, పెద్దలను అప్రమత్తం చేసి అవగాహన కల్పించాలన్నారు. ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ డైరెక్టర్ సిస్టర్ సహాయ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ ప్రోగ్రాం మేనేజర్ శుభ్రత్, హనుమకొండ, మహబూబాబాద్ జిల్లాల సీడబ్ల్యూసీ చైర్మన్, చైర్‌పర్సన్ అనిల్ చందర్ రావు, కె.నాగమణి పాల్గొన్నారు.

నిట్‌లో ఎడ్యుకేషన్ లోన్ మేళా

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్ విద్యార్థులకు విద్యలో చేయూతనందించేందుకు సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఎడ్యుకేషన్ లోన్ మేళాను సోమవారం నిర్వహించారు. అర్హతను బట్టి రుణాలు అందజేస్తున్నట్లు హైదరాబాద్ జోన్, డిప్యూటీ జోనల్ హెడ్ ఎంవీవీఎస్.ప్రసాద్, వరంగల్ జోన్ రీజినల్ హెడ్ వి.కృష్ణమోహన్ తెలిపారు.

'ఆశ'లకు ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశవర్కర్లు

హన్మకొండ అర్బన్: ఆశ వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల ఆడిటోరియం నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శనగా వెళ్లి హనుమకొండ కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాగుల రమేష్ మాట్లాడుతూ ఆశ కార్యకర్తలకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, ఏఎన్సీల టార్గెట్లను రద్దు చేయాలని కోరారు. ఫిక్స్‌డ్ వేతనం, పనిభారం తగ్గింపు కోసం సెప్టెంబర్ 1న నిర్వహించనున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం డీఎంహెచ్ఓ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అంజేశారు. కార్యక్రమంలో ఆశ యూనియన్ జిల్లా నాయకులు పద్మ, రాజేశ్వరి, యాకూబీ, శోభ, శ్రీవాణి, సంధ్య, సునీత, రజిత, కల్పన, రమ, పద్మ, నవమణి పాల్గొన్నారు

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

- టీపీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రయ్య

విద్యారణ్యపురి: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని హనుమకొండకు చెందిన టీపీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మన్నె చంద్రయ్య, సంఘం జనరల్ సెక్రటరీ మహ్మద్ అబ్దుల్లా కోరారు. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణాను హైదరాబాద్‌లో సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చంద్రయ్య మాట్లాడుతూ బీఈడీ పూర్తిచేసిన ఉపాధ్యాయులకు ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంలుగా పదోన్నతి కల్పించాలని, ఎస్‌జీటీలకు కంబైన్డ్ సీనియారిటీ ద్వారా, పండిట్ల అప్‌గ్రేడేషన్ పూర్తైనందున జీఓ నంబర్లు 11,12 ప్రకారం, ఎస్‌జీటీలకు కంబైన్డ్ సీనియారిటీ ద్వారా పదోన్నతులు కల్పించాలని సూచించారు. 317 జీఓతో నష్టపోయిన ఉపాధ్యాయులకు స్థానికత ఆధారంగా బదిలీలు చేపట్టాలని పేర్కొన్నారు. ఎఫ్ఆర్ఎస్ హాజరు అమలు చేస్తున్న నేపథ్యంలో మహిళా ఉపాధ్యాయులను దృష్టిలో ఉంచుకొని పాఠశాల సమయాన్ని ఉదయం 9.30 గంటలకు మార్చాలని కోరారు. మోడల్ స్కూళ్లలోని టీచర్లకు రెగ్యులర్ ఉపాధ్యాయుల మాదిరిగా అన్ని సదుపాయాలు కల్పించాలన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న మన్నె చంద్రయ్య

సంక్షిప్తంగా

నేత్రదాన కరపత్రం ఆవిష్కరణ

హన్మకొండ అర్బన్: 40వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకొని ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8వ తేదీ వరకు సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న కార్యక్రమాల కరపత్రాలను హనుమకొండ జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి అప్పయ్య సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు డీఎంహెచ్ఓ మదన్‌మోహన్, అశోక్‌రెడ్డి, జిల్లా ఆరోగ్యశాఖ మాస్ మీడియా అధికారి, సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు శంకర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయక విగ్రహాలను పూజించాలి

హసన్‌పర్తి: మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని కాజీపేట ఏసీపీ పింగిళి ప్రశాంత్‌రెడ్డి అన్నారు. హసన్‌పర్తి మండల కేంద్రంలోని సుజాత విద్యానికేతన్ పాఠశాల ఆధ్వర్యంలో ఉచిత వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆకుతోట రాంబాబు, కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, పోలీస్ ఇన్‌స్పెక్టర్ చేరాలు, ఎస్సై దేవేందర్, ఉప ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలతోనే పండుగ జరుపుకోవాలి

విద్యారణ్యపురి: మట్టి వినాయక విగ్రహాలతోనే పర్వదినాన్ని జరుపుకోవాలని సైకిల్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జంగా గోపాల్‌రెడ్డి అన్నారు. హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో సైకిల్ వాకర్స్ అసోసియేషన్, యోగా బృందం సమక్షంలో మట్టి విగ్రహాలను సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్ భారతి, కార్యదర్శి అనంత్‌కుమార్, కోశాధికారి రమేష్, బాధ్యులు మామడి నర్సయ్య, డాక్టర్ సాంబమూర్తి, వాకర్స్ ఇంటర్నేషనల్ జిల్లా కార్యదర్శి రామచందర్, ఉపేందర్ రెడ్డి, నర్సింహారావు, యోగా ట్రైనర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యనందించాలి

హసన్‌పర్తి: విద్యార్థులకు విలువలతో కూడిన విద్యనందించినప్పుడు వారు లక్ష్యాన్ని అధిరోహిస్తారని కాకతీయ యూనివర్సిటీ పాలక మండలి సభ్యురాలు అనితారెడ్డి అన్నారు. హసన్‌పర్తి మండలం అన్నాసాగరం శివారులోని సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో 'యాంటీ ర్యాగింగ్, హ్యూమన్ ట్రాఫికింగ్, సైబర్ నేరాలపై సోమవారం ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశ్రీరెడ్డి, అధ్యాపకులు డాక్టర్ శ్రీవాణి, ఏఓ వేణుగోపాల్‌తో పాటు వివిధ విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణ శిబిరం ప్రారంభం

కాజీపేట: ఆల్ఫా ఒమేగా ట్రస్ట్ ఆధ్వర్యంలో కాజీపేట 63వ డివిజన్ బాపూజీనగర్‌లో మహిళలకు ఉచిత కుట్టుశిక్షణ శిబిరాన్ని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే సతీమణి నాయిని నీలిమా రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలకు ఉచిత ప్రమాద బీమాను కల్పిస్తూ చేయూతనందించారు. అనంతరం డ్రా నిర్వహించి ఉచితంగా కుట్టు మిషన్లను అందించారు. కార్పొరేటర్ విజయశ్రీ రజాలీ, ట్రస్టు చైర్మన్ బిషప్ జాన్ మార్కండేయ, ఇప్ప శ్రీకాంత్ పాల్గొన్నారు.

చిన్నారులకు అభినందన

కాజీపేట రూరల్: బాపూజీనగర్‌లోని సదాశ్రీ కూచిపూడి కళాక్షేత్రం గురువు దువ్వ రేవతిరాజు, చిన్నారులను ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి సతీమణి నాయిని నీలిమారెడ్డి అభినందించారు. దువ్వ రేవతిరాజు శిష్య బృందం ఇటీవల తిరుమల తిరుపతి పుణ్యక్షేత్రంలో నాట్య ప్రదర్శనలు ఇచ్చింది.

నేత్రదానంతో మరో ఇద్దరికి వెలుగు

హసన్‌పర్తి: నేత్రదానంతో మరో ఇద్దరికి వెలుగు నివ్వవచ్చని సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్ అన్నారు. ఇటీవల అనారోగ్య సమస్యలతో మరణించి, నేత్రదానం చేసిన మంత్రిపురి కాలనీకి చెందిన కనపర్తి సరోజన సంతాపసభ సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శరీర, అవయవ దానాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం సరోజన కుమారులు కనపర్తి శ్రీనివాస్, సమ్మయ్య, శంకర్, కుమార్తె స్వరూపకు జ్ఞాపిక అందించారు. సదాశయ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు శంకర్‌రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన

ఖిలా వరంగల్: వరంగల్ శివనగర్‌లోని విశ్వశాంతి భవనంలో బ్రహ్మకుమారి సవిత ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి మంచి స్పందన లభించిందని నిర్వాహకులు తెలిపారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ అవినాష్ హాజరై రెండో రోజు రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. అనంతరం రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. రెడ్‌క్రాస్ సొసైటీ సిబ్బంది 120 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. బ్రహ్మకుమారీలు శ్రీదేవి, సుధాకర్, శశిధర్, కల్పన, వైష్ణవి, చరిత, సరిత, కల్పన, నాగరాజు పాల్గొన్నారు.

జేఎస్ఎస్‌లో వైద్య శిబిరం

వరంగల్ స్పోర్ట్స్: మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని (జాతీయ క్రీడా దినోత్సవం) పురస్కరించుకుని హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో క్రీడాకారులకు వైద్యశిబిరాన్ని సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డీవైఎస్ఓ గుగులోతు అశోక్‌కుమార్ మాట్లాడుతూ క్రీడాకారులు ఆరోగ్యంగా ఉంటేనే క్రీడల్లో రాణిస్తారని అన్నారు. విజేతలకు ఈ నెల 29వ తేదీన సాయంత్రం నిర్వహించే ముగింపు వేడుకల్లో బహుమతులు ప్రదానం చేయనున్నట్లు అశోక్‌కుమార్ తెలిపారు.

అన్నదానం

హన్మకొండ కల్చరల్ / నయీంనగర్: అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచారసభ హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో హనుమకొండ కేయూ క్రాస్‌రోడ్డులో అన్నప్రసాదాల వితరణ కార్యక్రమం సోమవారం జరిగింది. ముఖ్యఅతిథిగా 53వ డివిజన్ కార్పొరేటర్ సోదా కిరణ్ పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సంతోష్‌కుమార్, కమిటీ రాష్ట్ర జోనల్ కార్యదర్శి కంకతి సాగర్ గౌడ్, పీఆర్వో బాలరాజు, అజయ్‌గౌడ్, ఈసీ సభ్యులు జితేందర్, ప్రవీణ్, బాదావత్ బాలాజీ, భాస్కర్, అయ్యప్ప భక్తులు నర్సయ్య, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల హౌస్ అరెస్ట్

ఖిలావరంగల్: కాంగ్రెస్ జనహిత పాదయాత్ర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తుగా బీజేపీ నాయకులను మిల్స్‌కాలనీ పోలీసులు సోమవారం ఉదయం హౌస్ అరెస్ట్ చేశారు.

'ఏనుగు'పై ఊరేగిన గణనాథుడు

కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలోని ఉత్సవ విగ్రహాలను సోమవారం సాయంత్రం పుర వీధుల్లో ఐరావతం విగ్రహం (ఏనుగు)పై ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు అయిన వోలు రాధాకృష్ణ శర్మ, సాయికృష్ణ శర్మ, కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, తుమ్మ శ్రీనివాస్, కె.భాస్కర్ రావు తదితరులు పాల్గొన్నారు.

'పీహెచ్‌డీ'లో వర్గీకరణ అమలు చేయాలి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని వివిధ విభాగాలల్లో పీహెచ్‌డీ అడ్మిషన్లలో ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్ కేయూ అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ సుజాత, ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ డాక్టర్ పుల్లా శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రంకు సోమవారం వినతిపత్రం అందజేశారు.

సుధాకర్‌రెడ్డికి ఘన నివాళి

మడికొండ: సీపీఐ అగ్రనేత సురవరం సుధాకర్‌రెడ్డి మరణం పార్టీకి తీరని లోటు అని పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఆదిరి శ్రీనివాస్ అన్నారు. కాజీపేట మండల సమితి ఆధ్వర్యంలో మడికొండ చౌరస్తాలో సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి సోమవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ భూస్వామ్య కుటుంబంలో పుట్టి ఏఐఎస్ఎఫ్‌లో చేరి విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం పోరాడారని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ ఉద్యమం, పేదలకు ఇళ్ల స్థలాలు, భూసంస్కరణల అమలు కోసం ఉద్యమించారని గుర్తుచేశారు. అంచెలంచెలుగా కార్యకర్త నుంచి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎదిగిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు.

టెక్స్‌టైల్ పార్కుకు ఆర్టీసీ బస్సు సౌకర్యం

గీసుకొండ: గీసుకొండ – సంగెం మండలాల పరిధిలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు(కేఎంటీపీ)లో పనిచేసే కార్మికులు, ఉద్యోగుల కోసం పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కలెక్టర్ సత్యశారద ఆర్టీసీ బస్సును సోమవారం ప్రారంభించారు.

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎల్. రాకేష్ వర్మ (SR) : 9885438059 (హన్మకొండ)
వి. రాజ్ కుమార్ (SR) : 9966290903 (హన్మకొండ)
కె. రవీందర్ (SR) : 9705236356 (వరంగల్)
పి.చంద్రశేఖర్ (ACO) : 9963646944 (వరంగల్)